# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 02 ఆగస్టు 2022


## స్పందన ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలి

### - జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



కడప క్రైం, ఆగస్టు 1, ప్రభాతవార్త:

జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీ సు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అన్బు రాజన్ స్పందన కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్సు ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. స్పందన ఫిర్యా దులకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

## మోటారుబైకు దొంగలు అరెస్ట్ : సిఐ విశ్వనాథ్‌రెడ్డి



రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలో మోటారుబైకు దొంగలను ఎట్టకేలకు రైల్వేకోడూరు సిఐ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో 6 మోటారుబైకులను, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు రైల్వేకోడూరు ఎస్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైల్వేకోడూరు మండలంలో ఈ నిందితులపై ప్రత్యేక నిఘా ఉంచిన తమ సిబ్బంది ఎస్ఐలు నరసింహా, హేమాద్రిలు ఎట్టకేలకు మోటారుబైకు దొంగలను పట్టుకొని చాకచక్యంగా అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సిఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులు మోటారుబైకులు దొంగతనం చేసి ఈజీ మనీ కోసం వాహనాలను తక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారిపోయిందని వారు తెలిపారు. అదేవిధంగా ఈజీ మనీ కోసం ఎవరైనా దొంగతనాల కోసం పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకొంటామని ఆయన హెచ్చరించారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

# హర్ ఘర్ తిరంగా పక్షోత్సవాల్లో అందరూ భాగస్వామ్యం కావాలి

### ఇంటింటా మువ్వన్నెల జెండా రెపరెపలాడాలి

### దేశభక్తిని, జాతీయ భావాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించాలి

### కలెక్టర్ విజయరామరాజు



కడప, ఆగస్టు 1 ప్రభాతవార్త :

"హర్ ఘర్ తిరంగా" కార్యక్రమ నిర్వహణలో భాగంగా.. ఈ నెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు.. నిర్వహించే పలు రకాల సాంస్కృతిక పక్షోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పిలుపునిచ్చారు. సోమవారం తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో.. స్పందన అర్జీల స్వీకరణకు ముందు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని పురస్కరించుకుని అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా.. "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా ప్రభుత్వాల ఆదేశాల మేరకు.. ఆగస్టు 1వ తేదీ నుండి 15వ తేదీ వరకూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంను మహోత్సవ కార్యక్రమంగా నిర్వహించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడంలో భాగంగా ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేలా.. ప్రభుత్వం ప్రణాళికను రూపొందించిందన్నారు. ఆ వివరాలను జిల్లా కలెక్టర్ వివరంగా తెలియజేశారు. ప్రజల్లో అవగాహన పెంచే పలు సాంస్కృతిక కార్యక్రమాల వివరాలు. ఆగస్టు 1న : గ్రామ, వార్డు సచివాలయాలు వారీగా.. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం పట్ల ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. 2న జాతీయ నాయకులుపింగళి వెంకయ్య, బళ్ళారి రాఘవల జయంతి ఉత్సవాలను నిర్వహించడం. 3న కాకాని వెంకట రత్నం జయంతి వేడుకలతో పాటు.. వారి వారి ప్రాంతాలలో ప్రాచుర్యం పొందిన స్వాతంత్రోద్యమ నేతల జీవిత గాథలపై సెమినార్లు నిర్వహించడం. 4న : దేశభక్తి గీతాలాపన పోటీలను.. పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ స్థాయిలో నిర్వహించడం. 5న పట్టణాలు, జిల్లా కేంద్రంలో డ్రామాలు, ఏకాపాత్రాభినయం వంటి కార్యక్రమాలను నిర్వహించడం. 6న దేశభక్తి అంశం మీద.. జాతీయ నాయకులు, వారి సేవలను మననం చేసుకునేలా ఛాయాచిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేయడం. 7న దేశభక్తిని పెంపొందించే, జాతీయ జెండా ఔన్నత్యాన్ని తెలిపేలా ర్యాలీలు నిర్వహించడం. 8న దేశభక్తి అంశంపై.. డ్రాయింగ్, పెయింటింగ్, ఎలెక్యూషన్, డిబేట్ పోస్టర్ మేకింగ్,జింగిల్స్ మొదలైన పోటీ పరీక్షలకు నిర్వహించడం. 9న దేశభక్తి ప్రతిబింభించేలా, జాతీయ భావాన్ని పెంపొందించేలా.. సాంస్కృతిక ఉత్సవాలను, కార్యక్రమాలను నిర్వహించడం. 10న వివి గిరి జయంతి వేడుకతో పాటు.. సాయంత్రం సంకీర్తనలు, హారతులు, బృంద గీతాలు మొదలైన సాంఘిక ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించడం. 11న సంస్కృతీ వారసత్వ సంపదను ప్రతిబింబించేలా.. పురవీధుల్లో పాదయాత్రను నిర్వహించడం. 12న క్రీడా పోటీలను నిర్వహించడం. 13న ప్రతి ఒక్కరూ.. జాతీయ జెండాతో సెల్ఫీ ఫోటోలను.. 'హర్ ఘర్ తిరంగా' వెబ్ సైట్ లో అప్ లోడ్ చేయడం. 14న : స్వాతంత్ర్య సమరయోధులు ఇళ్లకు వెళ్లి.. వారి కుటుంబ సభ్యులను గౌరవ పూర్వకంగా సత్కరించటం. 15న పాదయాత్రలు, ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహించడం వంటి కార్యక్రమాలతో "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించి.. ప్రజల్లో జాతి గౌరవాన్ని.రెట్టింపు చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. .జాతీయ జెండాల పంపిణీలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ జాతీయ పతాకాలను పంపిణీ చేస్తూ.. ప్రతి ఇంటిపై, సముదాయంపై ఆగస్టు 13 నుండి 15వ తేదీ వరకు మూడు రోజుల పాటు జాతీయ పతాకాన్ని ఎగరవేసి "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా అన్ని శాఖలు, విభాగాలు ఫ్లాగ్ కోడ్‌ను ఖచ్చితంగా పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. దేశ భక్తిని, జాతీయ భావాన్ని పెంపొందించేలా "హర్ ఘర్ తిరంగా" ఉత్సవ కార్యక్రమాలను ఎంతో ఘనంగా నిర్వహించేందుకు అధికారులందరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించాలి

### శకటాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకునేలా ఉండి

### వివిధ శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలి

### కలెక్టర్ గిరీష్ పి.ఎస్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు



రాయచోటి, ఆగస్టు 1 ప్రభాతవార్త :

అన్నమయ్య నూతన జిల్లాలో మొట్టమొదటిసారిగా నిర్వహించే ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ వివిధ శాఖల హెచ్‌ఓడీలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందనహాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమిమ్ అన్సారియా, డిఆర్ఓ సత్యనారాయణ, వివిధ శాఖల హెచ్ ఓడిలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో మొట్టమొదటిసారిగా నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ఎటువంటి చిన్న పొరపాటు కూడా జరగకుండా అధికారులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసే శకటాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్ ఆకర్షణీయంగా ఉండాలన్నారు. శకటాలకు సంబంధించి వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, హౌసింగ్, విద్యాశాఖ, పౌర సరఫరాల సంస్థ తదితర శాఖలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఎగ్జిబిషన్ స్టాల్స్ కు సంబంధించి నీటిపారుదల శాఖ, గ్రౌండ్ వాటర్, సర్వే మరియు భూమి రికార్డుల శాఖ తదితర శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్లకు సంబంధించి పిడి డ్వామా ఓవరాల్ ఇన్చార్జిగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారి సమన్వయం చేసుకొని 4 నుంచి 5 మాత్రమే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రూప్ డ్యాన్స్ చేసే విద్యార్థుల కార్యక్రమం డ్రెస్ కోడ్ ధరించి చేయాలన్నారు. విద్యార్థులకు పెయింటింగ్ కాంపిటేషన్, వ్యాస రచన పోటీలు నిర్వహించి ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేయాలన్నారు. పెరేడ్ మైదానంలో వైట్ వాష్, షామియానా వంటి ఏర్పాట్లు మున్సిపల్ కమిషనర్ చూడాలన్నారు. స్టేజ్, సీటింగ్ అరేంజ్మెంట్ కు సంబంధించి ఆర్డీవో పర్యవేక్షణ చేయాలన్నారు. పిల్లలకు తాగునీటి సమస్య లేకుండా మంచి క్వాలిటీ వాటర్ బాటిల్స్ సప్లై చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈకి సూచించారు. అదేవిధంగా పిల్లలందరికి మిఠాయిలు పంచాలని డిఎస్ఓ కు సూచించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ (మిగతా IIవ పేజీలో)

## ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తాం

### కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్‌చంద్



కడప కార్పొరేషన్, ఆగస్టు 1, ప్రభాతవార్త:

కడప నగర వాసులు నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్‌చంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కడప నగరపాలక సంస్థలో స్పందన కార్యక్రమం జరిపారు. నగరవాసుల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ జి.సూర్యసాయిప్రవీణ్ చంద్ మాట్లాడుతూ అర్జీలు విషయంలో జాప్యం ఉండకుండా పరిష్కరించాలని అధికారులను కోరారు. సమస్యలు లేని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలన్నారు. మొత్తం 54 అర్జీలు ప్రజల నుంచి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, మేనేజర్ హిదయతుల్లా, ఆర్ఓలు కన్నయ్య, విజయభాస్కర్, ఆర్ఐ గఫూర్, డిప్యూటీ సిటీ ప్లానర్ సంజీవ్‌కుమార్, ఏసీపీ నాగేంద్ర, టీపీవో రామారావు, టీపీఎస్ చంద్రమోహన్, సూపరింటెండెంట్ కిశోర్, గుర్రప్ప, ఎస్ఈ సుబ్బరాయుడు, ఈఈ నారాయణ, డీఈఈలు కరీముల్లాఖాన్, రాజేష్, వేణుగోపాల్, అబిద్ హుసేన్, ఏఈలు మల్లేష్, మణిగోపాల్‌రెడ్డి, అబ్దుల్, దిల్షాద్, స్వరూప, నిరుపమ, దీప్తి, ఎంహెచ్ఓ ప్రశాంత్ వర్ధన్, మలేరియా ఆఫీసర్ భారత్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు ఆర్‌వీ రమణ, లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీంద్ర, గంగాధర్, చలపతి, అకౌంట్స్ రాధిక, హార్టికల్చర్ అనిల్‌కుమార్, సర్వేయర్ జోసెఫ్, స్టోర్ ఇన్‌ఛార్జి చెంచులక్ష్మి పాల్గొన్నారు.

## చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు



తహశిల్దారుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పుల్లంపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త

పుల్లంపేట మండలంలో వత్తలూరు గ్రామ పంచాయతిలోని దేవసముద్రం చెరువులో మట్టిని టిప్పర్లతో రాత్రి సమయాల్లో తరలిస్తున్నారు. ఆ చెరువు సంఘం అధ్యక్షుడు మాదినేని వెంకటసుబ్బయ్య తెలుగుదేశంపార్టీ నాయకులతో కలిసి సోమవారం తహశిల్దారు నరసింహకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దేవసముద్రం చెరువులో విపరీతమైన మట్టి తరలించడం వల్ల లోతుగా కావడంతో స్థానికులు ఆ గుంతల్లో పడి మృతి చెందుతున్నారన్నారు. అంతేగాకుండా చెరువుకట్ట సమీపంలో లోతు ఉన్నందున చెరువు కట్టకు కూడ ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని ఇలా అక్రమంగా మట్టిని తరలించకుండా చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో వారు కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌నాయుడు, వెంకటసుబ్బయ్యయాదవ్, గంగాధర్, ముద్దా గంగిరెడ్డి, చిన్నం శివయ్య ఇంకా పలువురు తెలుగు తమ్ముళ్లు ఉన్నారు.

### రేషన్ బియ్యం పంపిణీలో మోసం

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు పిలుపు మేరకు రైల్వేకోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ్‌నాయుడు ఆదేశాల మేరకు రేషన్ బియ్యం పంపిణీలో మోసం, రేషన్‌కార్డులు తొలగింపు, నాణ్యతలేని వస్తువుల పంపిణీ, రేషన్ కోటాలో కోత విషయాలపై వినతిపత్రానికి మండల తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో తహశిల్దారు నరసింహకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులతో పాటు ఉపాధ్యక్షుడు, పలువురు తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు, తెలుగుతమ్ముళ్లు తదితరులు ఉన్నారు.

## చౌకదుకాణాలకు చేరని గరీబ్‌కల్యాన్ యోజన బియ్యం

### కూపన్లు పంపిణీ చేసిన వాలంటీర్లు

### మొదటిరోజు వెనక్కు వెళ్లిన రేషన్‌కార్డుదారులు



రాజంపేట రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న తెలుగుదేశంపార్టీ నేతలు

రాజంపేట అర్బన్, ఆగస్టు 1 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం గరీబ్‌కల్యాన్‌యోజన పథకం కింద మంజూరు చేసిన బియ్యం సోమవారం నాటికి కూడ చౌకదుకాణాలకు చేరలేదు. రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ ఈనెల 1 నుంచి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాహనంలోను, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు చౌకదుకాణంలోను బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. చౌకదుకాణంలో ప్రధానమంత్రి గరీబ్‌కల్యాన్ పథకం బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే రాజంపేట మండలంలో చౌకదుకాణాలకు చేరలేదు. మున్సిపాలిటి పరిధిలోని ఏ ఒక్క చౌకదుకాణానికి కూడ బియ్యం సరఫరా చేయలేదు. అయితే తహశిల్దారు ఆదేశాల మేరకు విఆర్ఓలు అందజేసిన బియ్యం కూపన్లను పలుచోట్ల వాలంటీర్లు, రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేశారు. దీంతో ప్రజలు చౌకదుకాణాల వద్దకు మధ్యాహ్నం వెళ్లారు. దీంతో డీలర్లు ఇంకా తమకే బియ్యం పంపిణీ చేయలేదని స్పష్టం చేశారు. మీడియాలో వచ్చిన వార్తల గురించి డీలర్లను రేషన్ కార్డుదారులు నిలదీశారు. రెవెన్యూ అధికారులు తమకు బియ్యం సరఫరా చేయకుంటే తామేమి చేయగలమని లబోదిబోమంటూ చెప్పారు. దీంతో డీలర్లు ఇదే విషయాన్ని తహశిల్దారు, స్టాక్‌పాయింట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రం నుంచే స్టాక్‌పాయింట్లకు గరీబ్‌కల్యాన్‌యోజన బియ్యం నిల్వలు రాలేదని తెలుస్తోంది. మరికొన్నిచోట్ల డీలర్లు ఒకేసారి బియ్యం భారీగా తమకు సరఫరా చేసే నిల్వ చేసేందుకు స్థలం లేదని ఇదివరకే చెప్పినట్లు తెలుస్తోంది. రెండు నెలల బియ్యం కూపన్లు రెవెన్యూ అధికారులు రేషన్‌కార్డుదారలకు పంపిణీ చేశారు. పలుచోట్ల నేటినుంచి బియ్యం తమకు సరఫరా చేసినట్లయితే పంపిణీ చేస్తామని డీలర్లు కార్డుదారులకు నచ్చజెప్పి పంపించివేశారు. కాగా రేషన్ సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, గతంలో పంపిణీ చేసినట్లు నిత్యావసర సరకులు సక్రమంగా అందడంలేదంటూ తెలుగుదేశం నేతలు, తెలుగుదేశంపార్టీ నాయకులు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఆహారభద్రత చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 4 నెలలకు బియ్యం పంపిణీ చేసినా ఇంతవరకు సరఫరా చేయలేదని ధ్వజమెత్తారు. వెంటనే కేంద్రం పంపిణీ చేసిన బియ్యాన్ని ప్రజలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నేతలు గన్నే సుబ్బనరసయ్య, సంజీవరావు, ప్రతాప్‌రాజు, దగ్గుపాటి మణి, సుబ్రమణ్యంనాయుడు, అనసూయ, మనుబోలు వెంకటేశ్వర్లు, కొల్లి రెడ్డయ్య, ఆనంద్, మేడా ముని, సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

## గ్రామాల్లో స్మశానాలను ఆక్రమిస్తే కఠినచర్యలు

### శాలిపేట భూఆక్రమణదారులపై చర్యలు తీసుకొంటాం

### ధర్నా చేసిన ప్రజలకు ఆర్‌డిఒ హామి



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న శాలిపేట గ్రామ మహిళలు, తహశిల్దారుతో ఫోన్లో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

రాజంపేట అర్బన్, ఆగస్టు 1 ప్రభాతవార్త

మండలంలోని శాలిపేట గ్రామంలో భూఆక్రమణలపై కఠినచర్యలు తీసుకొంటామని ఆర్‌డిఒ కోదండరామిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం శాలిపేట గ్రామస్థులు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద గ్రామంలోని స్మశానాన్ని ఆక్రమించిన ఉదంతంపై ధర్నా నిర్వహించారు. భూఆక్రమణదారులపై కఠినచర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ప్లేకార్డులు ప్రదర్శించారు. ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. తక్షణం స్పందించిన ఆర్‌డిఒ, తహశిల్దారు సుబ్రమణ్యంరెడ్డితో ఫోన్లో మాట్లాడారు. ఆక్రమణలకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుమ్మరుల స్మశానవాటికకు పక్కనే ఉన్న భూమిని సర్వేచేసి ఆక్రమణ కాకుండా చర్యలు తీసుకోవాలనా న్నరు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే సహించేది లేద"ని ఆర్‌డిఒ స్పష్టం చేశారు. ఆర్‌డిఒ హామీతో శాలిపేట గ్రామస్థులు ధర్నా కార్యక్రమాన్ని విరమించారు.

## స్పందన ఆర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

రాయచోటి, ఆగస్టు 1 ప్రభాతవార్త :

స్పందన అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి గడువులోపు పరిష్కరించాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ గిరీష పిఎస్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ లోని స్పందన హాల్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గిరీషా పిఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆర్ఓ సత్యనారాయణలు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు స్పందన అర్జీలను పరిశీలించిన తర్వాత అర్జీ దారులకు అర్థమయ్యే విధంగా పరిష్కార నివేదిక పంపాలన్నారు. ఇలా చేయడం వల్ల అర్జీలు రీ ఓపెన్ చేసే అవకాశం ఉండదన్నారు. అర్జీలను గడువులోపల పరిష్కరించి బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు. అధికారులు స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా నిర్దేశించిన గడువులోపల క్లియర్ చేయాలన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే ఉద్దేశంతో స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అధికారులందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని స్పందన కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను శనివారం లోపల క్లియర్ అయ్యేటట్లు చూడాలన్నారు. దీంతో స్పందన అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు.

## కూల్చివేతలపై పెట్టే దృష్టి అభివృద్ధిపై పెట్టండి..

### - టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి,



కడప వైద్య విభాగం, ఆగస్ట్ 1, ప్రభాతవార్త:

వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు కూల్చివేతలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆ శ్రద్ధ అభివృద్ధిపై దృష్టి సారించాలని టీటీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు నగరంలోని గాయత్రి టవర్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూల్చివేతలతో సాధించిందేమిటని నిలదీశారు. ప్రజా వేదికతో మొదలైన కూల్చివేతలు ఇప్పుడు పేదల ఇళ్లను కూల్చి వేస్తే వారు ఎక్కడికి వెళ్లి తలదాచుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం సొంత జిల్లాలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే రాష్ట్ర పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు దుబాయ్ ప్రతినిధులు వస్తే అడ్డుకోవడం సరికాదన్నారు. పెట్టుబడిదారులను అమరావతి నుంచి తరిమేస్తే ఔత్సాహికులు ఎలా ముందుకు వస్తారన్నారు. టిడ్కో ఇళ్లను పేదలకు కేటాయించడంలో మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. బుగ్గవంక విస్తరణ పనుల్లో పేదల ఇళ్లు కూల్చిన అధికారులు కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి థియేటర్‌ను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్నించారు. త్వరలో అఖిలపక్షం ఆధ్వర్యంలో వరద కాల్వల విస్తరణ ఇళ్ల కూల్చివేతలపై పోరాటం చేస్తామన్నారు.

## తెలుగుదేశం విజయం కోసం కృషి చేయాలి : రాముడు



రాయచోటి, ఆగస్ట్ 1, ప్రభాతవార్త:

వచ్చే ఎన్నికల్లో రాయచోటి నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ అఖండ మెజార్టీతో విజయం సాధించాలని పట్టుదలతో మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అహర్నిశలు ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. సోమవారం ఉదయం రాయచోటి మండలం మాధవరం గ్రామంలో పర్యటించిన మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గ్రామస్తులు స్వాగతం పలికారు. ఆయన కస్పాలో ప్రతి ఇల్లు తిరుగుతూ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ రెడ్డి గారు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్ర రాష్ట్రన్ని అభివృద్ధి పదంలో ముందుకు నడపడమే కాకుండా సంక్షేమానికి కూడా పెద్దపీట వేశారన్నారు. రాయచోటి పట్టణం బోస్ నగర్ లో మైనార్టీ నేతలతో అలాగే సంబేపల్లి మండలం రోడ్డువారిపల్లె గ్రామాల్లో పర్యటించి ప్రస్తుతం ఉన్న వైసిపి పాలనలో బస్సు చార్జీలు కరెంట్ చార్జీలు నిత్యవసర ధరలు భూముల రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు పెట్రోలు డీజిల్, విపరీతంగా పెంచి అరాచక పాలన చేస్తున్నారని రాంప్రసాద్ రెడ్డి ఆరోపించారు. 2024లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో యువకులు,కార్యకర్తలు ఒక్కతాటిపై కి వచ్చి తెలుగుదేశం పార్టీని గెలిపించుకొని చంద్రబాబు నాయుడుని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుంటే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అనంతరం మాధవరం కస్పాలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ టిడిపి సీనియర్ నాయకులు హుస్సేన్ భాషా గారి సతీమణి పరామర్శించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రఘుపతి నాయుడు, రెడ్డప్ప నాయుడు, ఆచారి, జయరాం రెడ్డి, ఆదిరెడ్డి ముస్లిం మైనారిటీ నాయకులు బీసీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ఒక్క ఛాన్స్‌తో అధికారంలోకి వచ్చి

## ప్రజల నడ్డి విరుస్తున్న జగన్

### టిడిపి ఇన్‌చార్జి రమేష్ కుమార్ రెడ్డి



రామాపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త :

ఒక ఛాన్స్ అని ప్రజల ద్వారా ఓటు వేయించుకొని ముఖ్యమంత్రిగా గెలిచి ప్రజలకు నరకం చూపిస్తున్నాడని రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ ఆర్.రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని గువ్వల చెరువులో షేక్ ఆ జామ్ రూ 20 లక్షల రూపాయలతో ఏర్పాటుచేసిన కే జీ ఎన్ సిమెంట్ ఇటుకుల ఫ్యాక్టరీని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రతి ఒక్కరికి హామీ ఇచ్చారని ఓటు వేయించుకొని గెలిచిన తర్వాత ప్రజలు నడ్డి విరుస్తున్నారన్నారు. మేనిఫెస్టో లో పెట్టిన నవరత్నాలు ఎక్కడ కనిపించడంలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సున్యమేనని అన్నారు. గెలిచిన వారానికే సిపిఎస్ రద్దు చేస్తానని. మద్యపానం నిషేధము పూర్తిగా ఎత్తేస్తామనని ఎక్కడ మద్యపాన నిషేధం ఎక్కడ సిపిఎస్ రద్దు అనే జాడే కనిపించడం లేదన్నారు. స్పెషల్ స్టేటస్ ద్వారా అందరికీ ఉద్యోగాలన్నారు ఎక్కడుండాయి ఉద్యోగాలని ఆయన ప్రశ్నించాడు.. ఎవరు నోరు విప్పిన కేసులు నమోదు చేస్తానన్నారు. ఈ ప్రజాస్వామ్యంలో మాట్లాడడానికి ప్రజలకు హక్కులు లేకుండా చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. . చట్టాన్ని కాపాడే ఐఏఎస్. ఐపీఎస్ అధికారులు చట్టాన్ని కాపాడవలసినది పోయి జగన్ చుట్టూ కొమ్ము కాస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్ శంషర్ భాష. హరిప్రసాద్. మహమ్మద్ అలీ. జమ్రుద్ భాష .పాపయ్య. షేక్ సుబహాన్. కుమార్. నదీమ్. రఫీ. షేక్ గౌస్. సద్దాం. అక్రమ్. మహేష్. రియాజ్. ఉదయ్. షేక్షా. రామాంజనేయులు. జాఫర్. గౌస్ మోదీన్. జాఫర్. సుబ్రహ్మణ్యం. చిన్న. బాలకృష్ణ. దుర్గాప్రసాద్. రామ్మోహన్ రెడ్డి. మల్లికార్జున. పఠాన్. వెంకటేశు. కొండయ్య. శివారెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య అమృత మహోత్సవాలు ప్రారంభం

వాల్మీకిపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త



స్వాతంత్ర్య అమృత మహోత్స వాలను స్ధానిక పివిసి హైస్కూల్ ఇంచార్జ్ ప్రదానోపాధ్యాయులు అమరనాథ్ రెడ్డి ప్రారంభించారు. స్థానిక పాఠశాల ఆవరణంలో భారతమాత చిత్రపటానికి పూలమాల వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన మాసం సందర్భంగా 1వ తేదీ నుంచి పదిహేను రోజులు పాటు సమరయోధులను స్మరించుకొంటూ అమృత మహోత్స వాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశం పట్ల గౌరవం, మాతృభూమి పట్ల మమతానురాగాన్ని స్వరాభిమానాన్ని పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండవ్య, రవీంద్రరెడ్డి, శేఖర్‌రెడ్డి, నాగరాజ, రసూల్ బావాజీ, కల్పలత, వసుమతి, శంకర్, చెంగయ్య, నాగసులోచన, పురుషోత్తం విద్యార్థులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల తొలగింపుపై తహసీల్దార్‌కు వినతిపత్రం

వాల్మీకిపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త



నిరుపేదల కుటుంబాలకు రేషన్ బియ్యం పంపిణీ, కార్డుల తొలగింపుపై తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రదాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మండల తెదేపా నాయకులు తహశిల్దార్ ఫిరోజ్ ఖాన్‌కు వినతిపత్రం సమర్పించారు. రేషన్ షాపులలో ఇచ్చే కందిపప్పు, పంచదార పెంపు,నాణ్యత లేని బియ్యం పంపిణీపై వివరించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుర్రం మల్లికార్జున్ రెడ్డి,మాజీ జడ్‌పిటిసి సభ్యుడు వలిగట్ల వెంకట్రమణ, రాజంపేట ఎసి మైనార్టీ కన్వీనర్ డిష్ షఫీ, నియోజకవర్గ మండల మైనార్టీ,యూత్ అధ్యక్షులు సయ్యద్ బాష, చాను, కువైట్ సయ్యద్ బాష, పివి నారాయణ, పట్టణం అధ్యక్షులు డిష్ షబ్బీర్, కోసూరి చంద్రమౌళి, రమేష్, యూసఫ్, కువైట్ బాబు, సిద్దప్ప, రెడ్డిరామ్, ఆదినారాయణ పాల్గొన్నారు.

# నేటి నుంచి శ్రీ పట్టాభి రామస్వామి పట్టాభిషేక మహోత్సవములు

వాల్మీకిపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త



వాల్మీకిపురం పురాతన సుప్రసిద్ద దేవాలయం శ్రీ పట్టాభి రామస్వామి వారి ఆలయంలో పట్టాభిషేకం మహోత్స వాలను టిటిడి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జరగనున్నాయి.నేడు ఆలయంలో అంకురార్పణ కార్యక్రమం.సేనాధిపతి ఉత్స వంను నిర్వహిస్తారు. 3వ తేదీ ఉదయం యాగశాల పూజ, స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ, శాంతి కళ్యాణం, అనంతరం హనుమంత వాహనంపై విహరింపు. 4వ తేదీన గరుడ వాహనంపై నగరోత్స వం కార్యక్రమాలు సాగుతాయి. మూడు రోజుల పాటు టిటిడి ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో హరికథలు, భజనలు, ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# 3 నుంచి మొహరం వేడుకలు

మదనపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :

పట్టణంలోని త్యాగరాజవీధిలోని మకాన్‌నందు బుధవారం నుంచి మొహరం వేడుకలు నిర్వహించనున్నట్లు సయ్యద్‌ఫీర్, సయ్యద్ అహమ్మద్‌ఫీర్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా జరిగే ఈ మొహరం వేడుకలకు పట్టణంలోని ముస్లిం సోదరులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొక్కుబడులు, కానుకలు తీర్చుకోవాలని వారు కోరారు.

# 12వ రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ దీక్షలు

మదనపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :



బిజెపి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టభద్దత, వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో ఆమోదించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు చేపడుతున్న దీక్ష సోమవారంకు 12వ రోజు చేరింది. ఎమ్మార్పీఎస్ మేస్త్రీ రమణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. రాబోయే ఎన్నికల్లో చట్టబద్దత కల్పించకుంటే తీవ్ర పరిణామం చూడాల్సి వస్తుందని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంఎస్‌పి రవీంద్రరెడ్డి, శేఖర్, చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ ఆరేటి వాసు, మోపూరి మనోహర్, వై.రాజా, సుబ్బు, శ్రీరాములు, ఎర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

# రేపు ఎమ్మెల్యేచే నూతన ఫించన్లు పంపిణి

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 1 ప్రభాతవార్త :



అర్హులైన వృద్దులకు, వికలాంగులకు, వితంతవులకు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో నూతన ఫించన్లు 3న బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిచే పంపిణీ చేయనునట్లు ఎంపిడిఓ తెలిపారు. సోమవారం స్ధానిక ఎంపిడిఓ కార్యాలయంలో అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన వికలాంగులకు, వృద్దులకు, వితంతువులకు నూతనంగా మంజూరు అయిన ఫించన్లను స్ధానిక తహశీల్దార్ కార్యాలయం జడ్పిహైస్కూల్ మైదానంలో పంపిణీచేయనున్నట్లు తెలిపారు. పిటిఎం మండలానికి 557, బి.కొత్తకోటకు 477, మొలకలచెరువుకు 347 నూతనంగా ఫించన్లు మంజూరయ్యాయన్నారు. ఈ సమావేవంలో ఎంపిపి మహమ్మద్, జడ్పిటిసి శివన్న, ప్రత్యేక ఆహ్వానితులు సుబ్బరం, జిల్లా ఎస్‌సిఎస్‌టి మానటరింగ్ సభ్యులు కెవి.రమణ, బూర్లపల్లె సర్పంచ్ సుబ్బిరెడ్డి, ఉపసర్పంచ్‌లు మదూకర్‌రెడ్డి, మల్లెల వెంకట్, కోఆప్షన్ ఖాదర్‌వల్లీ, ఎంపిటిసిలు కార్యంచంద్ర, శ్రీనివాసులురెడ్డి, ఉత్తన్న, కేశవ, సయ్యద్‌బాషా, అర్‌డబ్ల్యుఎస్ మెకానిక్ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, వాలెంటర్లు తదితరులు పాల్గొన్నారు.

# మద్యంతో సహా కారు స్వాధీనం వ్యక్తి అరెస్టు

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 1 ప్రభాతవార్త :



మండలంలోని కాపుపల్లె క్రాస్ వద్ద సోమవారం ఎస్ఐ మధురామచంద్రుడు తన సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా బి.కొత్తకోట మండలానికి చెందిన సీతవారిపల్లె గ్రామనివాసి అమరనాథ్‌రెడ్డి(30) అనే వ్యక్తి కాపుపల్లెక్రాస్ వద్ద కర్నాటక నుంచి అక్రమంగా 1920 టెట్రా ప్యాకెట్లు కారులో ఉంచినట్లు గుర్తించిన పోలీసులు కర్నాటక మద్యంతో పాటు కారును స్వాధీనం చేసుకొని నిందితున్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మధు రామచంద్రుడు తెలిపారు.

# రేషన్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికి కూపన్లు ఇవ్వాలి

నిమ్మనపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :



మండలంలో రేషన్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికి బియ్యం కూపన్లు పంపిణీ చేయాలని టిడిపి నాయకులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రతినెలా చక్కెర, కందిపప్పు క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్, టిడిపి నాయకులు మునిరత్నం, మల్లికార్జున, వెంకటరమణ, విజయ్, శంకరా, నరేంద్ర, చినబాబు, భూపతి, రామచంద్ర పాల్గొన్నారు.

# రేపు చీఫ్‌విఫ్, మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంకు భారీ ఏర్పాట్లు

పెద్దమండ్యం ఆగస్టు 1 ప్రభాతవార్త

3వ తేదీన పెద్దమండ్యంలో ఛీఫ్‌విప్, మంత్రులు, ఎమ్మెల్యేల బహిరంగసభ భారీ ఏర్పాట్లకు వైసీపినాయకులు కసరత్తుచేస్తున్నారు. నియోజకవర్గంలో అదనంగా సుమారు 3వేలపెన్షన్లు మంజూరు అయ్యాయని వాటిని పంపిణీ చేయడానికి నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారని మండల అధికారులు వెల్లడించారు. ఎవరెవరువస్తారనేది ఇంకా స్పష్టత రాలేదన్నారు. ఈ సభ కోసం డ్వాక్రా సంఘాలు, లబ్దిదారులు, వైసీపి కార్యకర్తలు, నాయకులు, అధికారులు భారీగా తరలిరావాలని ఇప్పటికే వాలంటీర్లకు, సంఘాల సభ్యులకు సంకేతాలు పంపినట్లు సమాచారం. సమావేశానికి ఛీఫ్‌విప్, మంత్రులు, ఎంపి, ముగ్గురు లేక నలుగురు ఎమ్మెల్యేలు హాజరయ్యే అవకాశం ఉందని పార్టీవర్గాలు చెపుతున్నాయి.

# రేషన్ డీలర్ల కడుపుకొట్టక వారిసమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్‌కు వినతిపత్రం

టీడీపీ మండలాధ్యక్షుడు రమణ

పెద్దమండ్యం ఆగస్టు 1 ప్రభాతవార్త



రేషన్‌డీలర్ల కడుపుకొట్టకుండా వారిని యదావిధిగా కొనసాగించి వారి సమస్యలను పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ నిర్మలాదేవికి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బిల్డర్‌రమణ కార్యకర్తలు వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వంలో పేదలకు 8రకాల నిత్యావసర సరుకులు, బియ్యం, కందిపప్పు, ఆటా, జొన్నలు ఉప్పు, రాగులు, చక్కెర, తదితర సరుకులు పంపిణీ చేసేదన్నారు. ఈ వైసీపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి అన్నింటికి మంగళంపాడి కేవలం బియ్యం, చక్కెరతోనే సరిపెడుతూ పేదలకడుపు కొడుతుందన్నారు. దీనికితోడు బియ్యం పంపిణీకి ఎండియు వాహనం, ఆపరేటర్లును ఏర్పాటు చేసింది. అనంతరం ఎస్సీ వర్గీకరణపై పోరాటంచేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్‌పి నాయకులు వెంకటప్ప, కార్యకర్తలకు పూలమాలలు వేసి వారికి మద్దతు పలికారు. న్యాయపోరాటానికి తెలుగుదేశం పార్టీ ముందుంటుందని రమణ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# యువత క్రీడలలో రాణించాలి: సిఐ సురేష్

కలికిరి, ఆగస్టు 1 ప్రభాతవార్త



యువత విద్యతో పాటు క్రీడలలో రాణించాలని వాల్మీకిపురం సిఐ బిఎన్ సురేష్ అన్నారు.సోమవారం కలికిరి'-సోమల మార్గంలోని పొటేకులవారిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన స్పార్ట్ టెన్ వారియర్స్ ప్రీమియర్ లీగ్ టి20 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ టోర్నీ సుదూర్ ప్రాంతాల నుంచి వివిధ క్రికెట్ జట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఎన్నో ఉన్నత శికరాలు అదిరోహించ వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధీరజ్ రెడ్డి, నవతాజ్ రెడ్డి, స్పార్ట్ టీమ్ వరియర్స్ ప్రీమియర్ లీగ్ సభ్యులు, నాయకులు అవినాష్ రెడ్డి పాల్గొన్నారు.

# అర్హులైన అందరికి రేషన్ కార్డుల అందించాలి

కలికిరి,ఆగస్టు 1 ప్రభాతవార్త



అర్హులైన నిరుపేదల అందరికి రేషన్ కార్డులను అందించాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నిజాముద్దీన్ ఆధ్వర్యంలో జాతీయ ప్రదాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక తహశిల్దార్ భాగ్యలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపిలలో తెల్లరేషన్ కార్డు దారులకు బియ్యం ఇవ్వకుండా భద్ర చట్టాన్ని ఉల్లగిస్తున్నారన్నారు.ఇప్పటికే రాష్ట్రంలో 1872 లక్షల రేషన్ కార్డులను తొలగించడం జరిగిందన్నారు. తెల్లరేషన్ కార్డు కల్గిన ప్రతి ఒక్కరికి సాధారణంగా ఇచ్చే బియ్యంతో పాటు ఉచిత బియ్యంను అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి మాలతి, మండల ఉపాధ్యాక్షులు రెడ్డెప్పరెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, పీలేరు నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు షబ్బీర్ అహ్మద్, నాయకులు ప్రబాకర్, అక్బర్, గోపి, మర్రికుంటపల్లి సర్పంచ్ రెడ్డిరామ్, మండల రైతు అధ్యక్షులు సూర్యప్రకాష్‌రెడ్డి, మునాఫ్ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా ఆసుపత్రిలో విజిలెన్స్ తనిఖీలు

మదనపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :

జిల్లా ఏరియా ఆసుపత్రిలో సోమవారం విజిలెన్స్, ఎన్‌పోర్స్‌మెంటు అధికారులు తనిఖీలు నిర్వహించారు. వైఎస్ఆర్ కడప జిల్లా ఏఎస్‌పి ఉమామహేశ్వర్‌రావు ఆదేశాల మేరకు విజిలెన్స్ ఏఈ పురుషోత్తంరాజు, ఏఈలు కెవి.కిషోర్, అశోక్‌లు తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి ఎందమంది రోగులు వస్తున్నారో, ఎంతమంది రెఫర్ చేస్తున్నారో అన్న విషయాలపై తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిడింటెంట్ డాక్టర్ ఆంజినేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 6వ రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ దీక్షలు

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 1 ప్రభాతవార్త :



బిజెపి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టభద్దత, వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో ఆమోదించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు చేపడుతున్న దీక్ష సోమవారంకు 6వ రోజు చేరింది. ఈ దీక్షలకు టిడిపి మండల కన్వీనర్ ఆనందరెడ్డి, మాజీ జడ్పిటిసి ఈశ్వరప్ప, కట్ట సురేంద్రనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి శివానంద, కార్యనిర్వాహక కార్యదర్శి మస్తాన్‌లు మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో చట్టబద్దత కల్పించకుంటే తీవ్ర పరిణామం చూడాల్సి వస్తుందని తేల్చిచెప్పారు. ఈ దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లెల రవి, పిటిఎం చంద్ర, కాట్నగల్లు సోమశేఖర్, పులికల్లు రామచంద్ర, మెట్టపల్లె నరసింహులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పల్లెబాట విజయవంతం చేయండి

మండల కన్వీనర్ రేపన చౌడేశ్వర

తంబళ్లపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :



తంబళ్లపల్లి మండలంలో మంగళవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చేస్తున్న గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైకాపా మండల కన్వీనర్ రేపన చౌడేశ్వర పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం గంగిరెడ్డిపల్లి, అన్నగారిపల్లి పంచాయతీల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో జనాలు నీరాజనాలు పడుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గడపకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. నేడు తంబళ్లపల్లె నియోజకవర్గంలో మల్లయ్యకొండ పెద్దేరు ప్రాజెక్టు, పార్కు అభివృద్ధి, మదనపల్లి డివిజనల్ ఇంజనీర్ కార్యాలయాల తరలింపు, ప్రతి గ్రామానికి తారు, సిమెంటు రోడ్డు, ముదివేడు వద్ద సాగునీటి ప్రాజెక్టుకు శ్రీకారంతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు ఎన్నడూ జరగలేదని ఆయనకు ప్రజలు ముఖ్యంగా మహిళలు ఘనస్వాగతం పలకాలని ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# రాష్ట్రంలో పోలీస్‌రాజ్యం నడుస్తోంది

రాష్ట్ర పిసిసి అధ్యక్షులు శైలజానాథ్

మదనపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :



రాష్ట్రంలో పోలీస్‌రాజ్యం నడుస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు శైలజనాథ్ తెలిపారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక మాఫియా, సారాయి మాఫియా జోరుగా నడుస్తోందన్నారు. వీటిని ఎదురించిన వారిపై కేసులను నమోదు చేస్తూ భయభ్రాంతులను చేస్తున్నారన్నారు. రాష్ట్రం సలహాదారులతో పాలన నడుస్తోందని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నా ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 5న జైల్‌భరో కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు ప్రజలు తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డిసాహెబ్, సురేంద్ర, రెడ్డిభూ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ స్పందనలో 10 ఫిర్యాదులు

మదనపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :



మున్సి పల్ కార్యాలయ ఆవరణంలో సోమవారం నిర్వహించిన స్పందనా కార్యక్రమంలో పట్టణ ప్రజలు పది ఫిర్యాదులను అర్జీరూపంలో విన్నవించారు. మున్సి పల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి స్పందనా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసి అర్జీలను స్వీకరించారు. పట్టణంలో శానిటేషన్, దోమల బెడద, నీటి ఎద్దడి మురుగునీటి కాలువలు, పెన్షన్లు, హౌసింగ్, వీధిదీపాల గురించి ఫిర్యాదులు వచ్చాయి. వీటి పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోనున్నట్లు ఛైర్‌పర్సన్ తెలిపారు. 2న మంగళవారం ఉదయం 10గంటలకు మున్సి పల్ కార్యాలయంలో ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా పింగలి వెంకయ్య, బళ్ళారి రాఘవ జయంతిని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

# ఆగిఉన్న ఆటోను ఢీకొని వాలెంటర్ మృతి

నిమ్మనపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :

మండలంలోని కత్తిరివారిపల్లె వాలెంటీర్ వై.మల్లేశ్వర్(35) సాకిబండవారి పల్లె వద్ద ద్విచక్రవాహనంలో వెలుతూ ఆగి ఉన్న ఆటోను ఢీ కొని అక్కడిక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతునికి భార్య నాగవేణి కలదు. ప్రమాద స్థలాన్ని ఎస్ఐ పాతిమాబీ పరిశీలించారు. శవానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లెలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు.

# ప్రతి చోటా జెండా రెపరెపలాడాలి

నిమ్మనపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :



స్వాతంత్ర్య దినోత్స వం సందర్భంగా మండలంలో రాబోయే ఆగస్టు 15కు ప్రతి చోటా జెండా రెపరెపలాడాలని ఎంపిడిఓ లీలామాధవి సోమవారం ర్యాలీ నిర్వహంచారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, జడ్పిటిసి ప్రమీళమ్మ, వైఎస్ఆర్‌కన్వీనర్ రమణారెడ్డి, ఆర్‌బికె ఛైర్మెన్ రవికుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన ఫించన్లు పంపిణీ

నిమ్మనపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :



మండలానికి మంజూరైన నూతన ఫించన్లు 240మందికి స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి నరసింహులు, జడ్పిటిసి ప్రమీళ చేతుల మీదుగా ఫించన్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ లీలామాధవి, ఎంపిపి, జడ్పిటిసిలు, కన్వీనర్ రమణారెడ్డి, ఆర్‌బికె ఛైర్మెన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ వ్యవస్థ నిర్వీర్యంపై టీడీపీ నాయకుల ఫిర్యాదు

తంబళ్లపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :



రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్ ఆదేశాల మేరకు సోమవారం మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పేదలకు ఇవ్వాల్సిన రేషన్ బియ్యం నిర్వీర్యంపై తహసీల్దార్ కళావతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం కార్డుల తొలగింపు, నాణ్యత లేని వస్తువులు పంపిణీ, కొత్త రేషన్‌షాపులో ఇచ్చే కందిపప్పు, బియ్యం, పంచదార అక్రమ రవాణా జరుగుతున్నట్లు వాపోయారు. నాలుగు నెలల ఉచిత బియ్యాన్ని ప్రతిఒక్కరికి వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణమూర్తినాయుడు, సీనియర్ నాయకులు ఉత్తమరెడ్డి, బేరి శ్రీనివాసులు, మండల యువత అధ్యక్షుడు గంగరాజు, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నరసింహులు, సోమశేఖర్, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘర్ ఘర్ తిరంగాపై విద్యార్థుల అవగాహన ర్యాలీ

తంబళ్లపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :



మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా మన దేశ ఖ్యాతిని ప్రతిబింబించడానికి ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండా రెపరెపలాడాలని ఎంపీడీవో వెంకటరత్నం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె పురవీధుల్లో విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్స వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా మండలంలోని 12 సచివాలయాల పరిధిలో స్థానిక సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, స్వాతంత్ర దినోత్స వ ఔనత్యాన్ని ప్రజలకు ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో త్యాగరాజు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీపీఐ మండల, నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక

బి.కొత్తకోట, ఆగస్టు 1 ప్రభాతవార్త :

భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ తంబళ్లపల్లి నియోజకవర్గ 5వ మహాసభ సోమవారం బి.కొత్తకోటలో విజయవంతంగా జరుపుకున్నారు. సోమవారం జరిగిన ప్రతినిధుల సభలో నియోజకవర్గానికి బి.కొత్తకోట, మండల కమిటీలకు నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణప్పలు హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గపు కార్యదర్శిగా ఎస్.మనోహర్‌రెడ్డిని, కార్యవర్గ సభ్యులుగా ఎస్.బషీర్‌ఖాన్, బి.వేణుగోపాల్‌రెడ్డి, కె.అంజనప్ప (ములకలచెరువు), ఎస్.సలీంబాషా, పి.జవహర్‌బాబు, పి.శంకర (పీటీఎం), రామాంజులు (పెద్దమండ్యం), ఎస్.శివమ్మ (ములకలచెరువు), జి.ఆనయా (ములకలచెరువు), జె.ఆనంద (ములకలచెరువు), ఎం.అష్రఫ్‌వలీ, హెచ్.షమీవుల్లా, ఎం.గంగులప్ప, ఎస్.తంబయ్యశెట్టి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బి.కొత్తకోట కార్యదర్శిగా ఎస్.సలీంబాషా, సహాయ కార్యదర్శిగా పి.జవహర్‌బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# కొత్తగా 396 పింఛన్లు మంజూరు

ములకలచెరువు, ఆగస్టు 1, ప్రభాతవార్త:

ములకలచెరువు మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో కొత్తగా 396 పింఛన్లు మంజూరైనట్లు మండల అభివృద్ధి అధికారి రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని బురకాయలకోట1-37 పింఛన్లు, బురకాయలకోట2- 28 పింఛన్లు, చౌడసముద్రం, గూడుపల్లె 23 పింఛన్లు, కదిరినాథునికోటలో 21 పింఛన్లు, కాలువపల్లెకు 13 పింఛన్లు, మద్దినాయునిపల్లె-1లో 31 పింఛన్లు, మద్దినాయునిపల్లె-2లో 21 పింఛన్లు, ములకలచెరువు-1లో 39 పింఛన్లు, ములకలచెరువు-2లో 24 పింఛన్లు, పెద్దపాళ్యంకు 13 పింఛన్లు, సోంపల్లెలో 27 పింఛన్లు, కోనేటివారిపల్లెకు 18 పింఛన్లు, టి.చౌడసముద్రంకు 46 పింఛన్లు, వేపూరికోట 22 పింఛన్లు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. వీటిని ఈనెల 3న పీటీఎంలో జరిగే పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పింఛనుదారులకు ఎమ్మెల్యే చేతులు మీదుగా పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ సాయిలీలా తెలిపారు.

# జగనన్న ఎస్సీ లే అవుట్ కాలనీ పనులు వేగవంతం చేయాలి

ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 1, ప్రభాతవార్త:



జగనన్న ఎస్సీ లే అవుట్ కాలనీలో పనులు వేగవంతం చేసి ఇళ్ల నిర్మాణాల పనులు పూర్తి చేయాలని లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు నాగ ప్రసన్న లక్ష్మీతో కలిసి జగనన్న కాలనీలో పనులు వేగవంతం చేసేందుకు స్థానిక వీఆర్వోలు, హౌసింగ్ సిబ్బంది, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చొరవ చూపాలని సూచించారు. ఎస్సీ కాలనీలో ఇచ్చిన 44 ప్లాట్లను ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాలు కూడా అందజేయడం జరిగిందన్నారు. కాలనీలో మౌలిక వసతులు కల్పనకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ శంకర్ నాయుడు, డిప్యూటీ తహసీల్దారు నరసింహులు, ఆర్ఐ శ్రీధర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో నూతన పింఛన్లు పంపిణీ

దువ్వూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త:



మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయ పరిధిలో 264 మంది లబ్ధిదారులకు సోమవారం నూతనంగా పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. లబ్ధిదారులకు పింఛన్లతో పాటు కార్డు కూడా అందజేశామన్నారు. నీలాపురం గ్రామ సచివాలయ పరిధిలో 20 మందికి పింఛన్లు రాగా సర్పంచులు రాజగోపాల్‌రెడ్డి, రామయ్యలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు అందజేస్తున్నామన్నారు. దువ్వూరులో సర్పంచి చెంద్రాయుడు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరారెడ్డి, ఉపసర్పంచి మానందిని తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పింఛన్లు పంపిణీ

వేంపల్లె, ఆగస్టు 1, ప్రభాతవార్త :



అర్హులైన వారందరికీ ప్రభుత్వం నూతనంగా పింఛన్లు మంజూరు చేసిందని వేంపల్లె సర్పంచి ఆర్.శ్రీనివాసులు అన్నారు. సోమవారం వేంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ఆయా సచివాలయాల్లో ఆయన పర్యటించి లబ్ధిదారులకు కొత్త పాసుపుస్తకాలు, నగదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారు అభివృద్ధి చెందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మిగాయత్రి, వైస్ ఎంపీపీ బాబాషరీఫ్, కోఆప్షన్ సభ్యుడు అసానయ్య, వార్డు ఎంపీటీసీలు భారతి, పఠాన్ రహంతుల్లా, బ్రహ్మయ్య, మాజీ ఎంపీటీసీ గంగరాజు, వార్డు సభ్యులు ముత్యాల ఆంజనేయులు, పోలేపల్లె గణేష్, కంతూరి వెంకటేష్, సునీల్, ఉమర్, షామీర్, బాలరాజు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు మోహన్‌పవార్, కసిరెడ్డి ఆదినారాయణరెడ్డి, పుల్లయ్యతోట నగేష్, సచివాలయ కార్యదర్శులు కొండయ్య, చరణ్, రాఘవేంద్ర, వెంకటప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, వైసీపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ పెన్షన్‌కానుక పంపిణీ

పులివెందుల రూరల్, ఆగస్టు 1, ప్రభాతవార్త :



పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా మంజూరైన 270 వైఎస్ఆర్ పెన్షన్ కానుకను సోమవారం మున్సి పల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, ఛైర్మన్ వరప్రసాద్, కౌన్సి లర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.

# వృద్ధాశ్రమానికి రూ.10 వేలు చేయూత

బద్వేలు అర్బన్, ఆగష్టు 01 ప్రభాతవార్త :

పట్టణంలోని ఆనంద నిలయం నిరాశ్రయుల వసతిగృహానికి సోమవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గీతా ప్రసాద్ రెడ్డి తన భార్య ప్రథమ వర్ధంతి సందర్భంగా 10 వేల రూపాయలు చెక్కుతో పాటు, వృద్ధులకు వారి కుటుంబ సమేతంగా కలిసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గీతా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ అనుకోకుండా అనేక కారణాలతో ఆసరా కోల్పోయి వృద్ధాశ్రమాన్ని ఆశ్రయించిన అనాథ వృద్ధులకు చేయూతనిచ్చే లక్ష్యంతో తాము కృషి చేస్తామన్నారు. తన భార్య మొదటి వర్ధంతిని పురస్కరించుకొని ఆశ్రమంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. వృద్ధాశ్రమానికి అవసరమైన మౌళిక వసతుల కొరకు 10 వేల రూపాయలు చెక్కు అందజేయడం జరిగిందని, మరి కొందరు దాతలు ముందుకొచ్చి వృద్ధాశ్రమ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, ఆశ్రమ మేనేజర్ పిడతల రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పింఛన్ల పాసుబుక్కులు పంపిణీ

బద్వేలు రూరల్, ఆగష్టు 01 ప్రభావార్త :



బద్వేలు మండల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా అన్ని విధాల పంచాయతీ పరిధిలోని తిరువెంగళాపురాన్ని అభివృద్ధి చేస్తామని ఎంపీపీ రమణమ్మ, మండల వైసీపీ కన్వీనర్ బోడపాడు రామసుబ్బారెడ్డి, సర్పంచ్ నారిబోయిన సుబ నరసింహులు పేర్కొన్నారు. సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 28 కొత్త పింఛన్లు మరియు పాస్ పుస్తకములను తిరువెంగళాపురం సచివాలయం వద్ద లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, సచివాలయ పంచాయతీ కార్యదర్శి పొదిలి పెంచలయ్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సాంఘీక సంక్షేమ శాఖ కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి, వైసీపీ గ్రామ నాయకులు, నూతన పింఛన్ లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నూతనంగా వృద్దులకు పింఛన్లు పంపిణీ

ఓబులవారిపల్లె, ఆగస్టు 1, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన ఓబులవారిపల్లెలో సర్పంచి నూకా జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి అర్హులైన వృద్ధాప్య, రైతులకు సంబంధించిన అనేక పథకాలు అన్ని కులాల, వర్గాల వారికి ప్రభుత్వం నుంచి అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తూ ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం జగన్‌కు జనం జేజేలు పలికారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి భారతి, అసిస్టెంట్ ఏవో మధుసూదన్‌రావు, సిబ్బంది కిరణ్, మహిళా పోలీసు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ గ్రావెల్ తరలింపుపై మెరుపు దాడులు

**7 ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం : కేసు నమోదు**

**ఎస్సై రాజరాజేశ్వర్‌రెడ్డి**



**పెండ్లిమర్రి, ఆగస్టు 1, ప్రభాతవార్త:**

పెండ్లిమర్రి మండలంలోని తిప్ప రాజుపల్లె, గంగనపల్లి సమీపంలో సోమవారం అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై రాజరాజేశ్వర్‌రెడ్డి తన సిబ్బందితో వెళ్లి మెరుపు దాడులు చేశారు. ఈ దాడుల్లో 7 ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. మండలంలో ఎక్కడే గానీ అక్రమ గ్రావెల్ తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. అలాగే ముఖ్యంగా అనుమతి ఉంటే ఎక్కడికైనా తీసుకెళ్లివచ్చని అనుమతి లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి

**కడప కార్పొరేషన్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు మేలు జరిగే కార్యక్రమాలు జరుగుతున్నాయని 4వ డివిజన్ వైకాపా ఇన్‌ఛార్జి ఆర్.వి.రమణ పేర్కొన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. కడప మేయర్ కె.సురేష్‌బాబు కడప నగర అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని కీర్తించారు. గుర్రప్ప ఆధ్వర్యంలో చౌడమ్మ వృద్ధాశ్రమంలో అల్పాహారం అందజేశారు. శేషు, అబీబ్, ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆల్‌షిఫా మానసిక వికలాంగుల కేంద్రం, సాయిబాబా శరణలయంలో బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ యానాదయ్య, ఆర్.ఎన్.బాబు, వీరారెడ్డి, ఎల్లారెడ్డి, చక్రి, డివిజన్ నాయకులు హబీబ్, ప్రభాకర్, ఖాసీం, శ్రీనివాసులు, శంకర్, రవి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

**పులివెందుల రూరల్, ఆగస్టు 1, ప్రభాతవార్త :**



రాష్ట్రంలో రేషన్ వ్యవస్థను వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, వేముల మండల అధ్యక్షుడు బ్రహ్మయ్యలు అన్నారు. సోమవారం వేముల తహసీల్దారు లక్ష్మీనారాయణను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందాల్సిన ఆహార భద్రత అంశాలను తుంగలో తొక్కుతూ రేషన్ షాపులలో గత ప్రభుత్వంలో ఇస్తున్న చెక్కర, కందిపప్పు, నూనె ఇతరత్రా సరుకులను పేదలకు అందకుండా చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెర్నపాడు చిన్న అంకిరెడ్డి, పార్లమెంట్ కార్యదర్శి రామన్న (యేసు), తెలుగు యువత ఉపాధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గంగాధర్‌రెడ్డి, బయపురెడ్డి, చిన్నరెడ్డి, కొత్తపల్లె రమణారెడ్డి, గొందిపల్లె గంగిరెడ్డి, వసంతరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘన స్వాగతం పలికిన ప్రజలు

**1వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే**

**జమ్మలమడుగు, ఆగస్టు 1, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు 1వ వార్డులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గడప గడపన ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులను పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, లేపాక్షి హస్తకళల ఛైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మలికిరెడ్డి హనుమంతరెడ్డి, చేనేత ఐక్యవేదిక కన్వీనర్ బడిగించల చంద్రమౌళి, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ సింగరయ్య, కౌన్సిలర్ ముల్లా నూర్జహాన్, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ముల్లా జానీ, ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు నరసింహులు, ఏపీ ఇండస్ట్రియల్ డైరెక్టర్ మార్బుల్ శ్రీను, కోఆప్షన్ సభ్యులు ఫయాజ్ బాషా, మున్సిపల్ అధికారులు, విద్యుత్తు అధికారులు, హౌసింగ్, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివినపుడే ఉజ్వల భవిష్యత్తు

**తిరుమల ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామాగ్రి వితరణ**

**ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటాచలం**



**బద్వేలు అర్బన్, ఆగస్టు 01 ప్రభాతవార్త :**

మండల పరిధిలోని చెన్నకేశంపల్లె, తొట్టిగారిపల్లె ప్రాథమిక పాఠశాలల్లో ఉన్నటువంటి పలువురు విద్యార్థినీ, విద్యార్థులకు తిరుమల ట్రస్ట్, బెంగుళూరు వారి సహకారంతో విద్యా సామాగ్రిని సోమవారం ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటాచలం, కొలిశెట్టి సత్యనారాయణ, బ్రహ్మదేవుని యర్రంరెడ్డి, కొలిశెట్టి సత్యనారాయణ, పబ్బతి సత్యనారాయణ, పి.చంద్రశేఖర్ ల చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటాచలం మాట్లాడుతూ తిరుమల ట్రస్ట్, బెంగుళూరు వారి సహకారంతో గత 10 సంవత్సరాల నుండి బద్వేలు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినీ, విద్యార్థులకు నోట్ పుస్తకాలు, కంబాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, పలకలతో పాటు పలు రకాల విద్యా సామగ్రిని అందజేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. అనంతరం టీ బ్యాచ్ ఫ్రెండ్స్ కొలిశెట్టి సత్యనారాయణ, పబ్బతి సత్యనారాయణ, పబ్బతి చంద్రశేఖర్, బ్రహ్మదేవుని యర్రంరెడ్డి లు మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలనే సంకల్పంతోనే తిరుమల ట్రస్ట్, బెంగుళూరు వారి సహాయ సహకారాలు ఎల్లవేళలా అందించేందుకు ముందుండి ప్రతి యేటా మన బద్వేలు ప్రాంతంలో నిరుపేద విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో మాత్రమే విద్యా సామాగ్రిని పంపిణీ చేస్తూ వారిని ప్రోత్సహించే విధంగా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఆహారభద్రత కల్పించాలి

**టిడిపి నాయకులు కెకె చౌదరి**

**చిట్వేలి, ఆగస్టు 1 ప్రభాతవార్త**



ప్రజలకు ఆహారభద్రత కల్పించాలని రాజ్యాంగబద్ధంగా సిద్ధించిన హక్కు దశాబ్దకాలంగా అమలవుతున్నా ఆహారభద్రత కార్యక్రమా లకు గత కొద్దిరోజులుగా రాష్ట్రంలో వ్యతిరేకంగా జరుగుతుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, చిట్వేలి మండల టిడిపి బాధ్యుడు కెకె చౌదరి అన్నారు. సోమవారం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 ముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణాల్లో రూపాయికి కిలో బియ్యం 40 కిలోల చొప్పున అందించడంతో పాటు కిలో కందిపప్పు, 10 రూపాయలకే అరకిలో పంచదార అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. ఐదు అంశాలపై చిట్వేలి తహశిల్దారు మురళీకృష్ణకు వినతిపత్రం అందించడం జరిగిందని ఆయన తెలియజేశారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికి సాధారణంగా ఇచ్చే బియ్యంతో పాటు ఉచిత బియ్యాన్ని కూడ అందించాలని, ఇంటిముంగిటకే రేషన్ బియ్యం ప్రారంభించిన ఎండియు వాహనాల ఆపరేటర్‌లు వీధి చివరలో ఏదైన సెంటర్‌లో వాహనాలు ఆపి బియ్యం పంపిణీ చేస్తున్నారని, ఈ పరిస్థితిని సమీక్షించి ఇళ్లవద్దకు తెచ్చి రేషన్‌ను అందజేయాలని, బియ్యంతో పాటు కందిపప్పు, చెక్కెర వంటి అంశాలను కూడ నిత్యావసర సరకులు అవసరమని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో ఖాసీంఖాన్‌కు సన్మానం

**కడప, ఆగస్టు 1 ప్రభాతవార్త :**



కడప నగరంలోని మానస ఇన్ హోటల్ నందు లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా కార్యవర్గ సభ్యులు లయన్ ఖాసీంఖాన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఖాసీంఖాన్ మాట్లాడుతూ సేవా రంగంలో అపార సేవలు అందించానని గుర్తు చేసుకున్నారు. కడప అన్నమయ్య క్లబ్‌కు తన మాతృ సంస్థ చాంద్ బి మెమోరియల్ ట్రస్టు ద్వారా రూ.50 విరాళాన్ని ప్రకటించారు. ప్రతినిత్యం క్లబ్‌కు సేవలు అందిస్తానని పేర్కొన్నారు. అన్నమయ్య క్లబ్ తాజా, మాజీ గవర్నర్ అయిన చిన్న పరెడ్డి, నాగేశ్వర రావు, డాక్టర్ బాలమద్ది, అల్ అబీబా విద్యాసంస్థ చైర్మన్ అక్బర్ ఖాన్, మన్సూర్ అలీఖాన్, అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలపాలి

**లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 1, ప్రభాతవార్త:**

ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు స్వాతంత్ర్య సమరయోధుల గురించి పది నిమిషాలు వివరించాలని ఆజాదికా అమృత్ మహోత్సవ్ రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్.శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లెలోని విశ్వభారతి హైస్కూలు నందు ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భరతమాత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఔన్నత్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాఠశాలకు వచ్చిన వెంటనే భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుల గురించి విద్యార్థులకు వివరించాలన్నారు. తద్వారా విద్యార్థులు భావి భారత పౌరులుగా తయారవుతారన్నారు. ప్రతి ఒక్కరూ జీవన పరిణామాలతో మానవతా దృక్పథం కలిగి సాటి మనిషికి సహాయ పడేట్లు చూడాలన్నారు. ప్రతి రోజు అర గంట పాటు పాఠశాలలో నైతిక విలువలు జీవన పరిణామాలు విద్యార్థులకు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘురాం రాజు, కరస్పాండెంట్ రామచంద్రయ్య, ఏపీయూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ, నరసింహులు, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పంపిణీలో అలసత్వం వద్దు

**వేంపల్లె, ఆగస్టు 1, ప్రభాతవార్త :**



పేదలకు అందించే రేషన్ బియ్యం పంపిణీలో అలసత్వం వద్దని సర్పంచి శ్రీనివాసులు ఆదేశించారు. పట్టణంలో పలు రేషన్ దుకాణాలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాని, వీటిని సచివాలయాల ద్వారా పేదల ముంగిటకే పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రామాంజనేయులు, వైఎస్ఆర్‌సీపీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి ఆదినారాయణరెడ్డి, నాయకులు పుల్లయ్య తోట నగేష్, శివ, పవన్, పాలగిరి బాబు, తదితరులు పాల్గొన్నారు.

## నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

**కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**

ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఎగ్జామినేషన్‌కు సంబంధించిన 63 పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశామని ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతి లేదని ఆర్ఐఓ తెలిపారు. 63 పరీక్ష కేంద్రాలలో ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూం నుంచి ఆన్‌లైన్‌లో అధికారుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండో సంవత్సరం విద్యార్థులకు 2 గంటల నుంచి పరీక్ష కేంద్రాలలోకి అనుమతి ఉంటుందన్నారు. మొదటి ఏడాది 18,408, రెండో ఏడాది విద్యార్థులు 11,386 మంది హాజరు కాబోతున్నారన్నారు. ఉదయం 9 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షకు అనుమతించరన్నారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటలకు ఒక నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షకు అనుమతి లేదని తెలిపారు.

## రేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న వైఖరిని మార్చుకోవాలి

**కమీషనర్‌కు వినతిపత్రం అందించిన టీడీపీ నాయకులు**

**బద్వేలు, ఆగస్టు 01 ప్రభాతవార్త:**



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అనేక పథకాలకు తూట్లు పెడుతున్నారని, రేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడాన్ని నిరసిస్తూ మున్సిపల్ కమీషనర్‌కు బద్వేలు తెలుగుదేశం నాయకులు వినతిపత్రం అందజేశారు. బద్వేలు మండల పార్టీ అధ్యక్షులు వెంగల్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్ రెడ్డి ఆదేశాల ప్రకారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బాధ్యులు డా॥ ఓబుళాపురం రాజశేఖర్, అట్లూరు మండల పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున రెడ్డి, బద్వేలు రూరల్ పార్టీ అధ్యక్షులు రవి కుమార్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి మిత్తికాయల రమణ, సీనియర్ నాయకులు కొంకుల రాంబాబు, కౌన్సిలర్ షేక్ హసన్, మాజీ కౌన్సిలర్ సమ్మెట అబ్రహాం, నాయకులు జహంగీర్ బాషా, దానం, ఉప్పలపాటి వెంకట సుబ్బయ్య, మాచుపల్లె కృష్ణారెడ్డి, మస్తాన్ బాబు, ప్రణీత్ కుమార్, వేణుగోపాల్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆహార భద్రత చట్టాన్ని ఉల్లంఘించిన జగన్

**నందలూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త**



కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి ఉచిత బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఇవ్వడంలేదో సమాధానం చెప్పాలని టిడిపి మండల అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి పసుపులేటి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం నందలూరు మండల తహశిల్దారుకు తెలుగుదేశంపార్టీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ బియ్యం పంపిణీలో మోసం జరిగిందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉన్నటువంటి రేషన్‌కార్డులను అక్రమంగా అనేక కారణాలు పెట్టి కార్డులను తొలగించడం దారుణమన్నారు. వెంటనే ఉచిత బియ్యాన్ని అందరికి పంపిణీ చేయాలని టిడిపి తరపున వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి తిరుపతయ్య, నందలూరు గ్రామ సర్పంచ్ మోడపోతుల రాము, టిడిపి ఎస్‌సిసెల్ అధ్యక్షులు జ్యోతి శివ, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గుండు సురేష్, టిడిపి నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతి అధ్యక్షులు గంధం గంగాధర్, పాటూరు టిడిపి గ్రామ అధ్యక్షులు రమేష్, టిడిపి మండల ఉపాధ్యక్షుడు చామంచి పెంచలయ్య, నారపుశెట్టి శివ, కిరణ్, ఆడపూరు శ్రీనాథ్, హుస్సేన్, చుక్కా కొండయ్య, రెడ్డయ్య, నాగార్జున, జాఫర్, భాస్కర్, యూసుబ్, కుర్రామణి, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు అందిన పింఛన్లు

**ఓబులవారిపల్లె, ఆగస్టు 1, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లె మండలం ఎల్లాయపల్లె పంచాయతీలో సర్పంచి జరుగు నారాయణరెడ్డి నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేయడంతో అర్హులైన లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. సీఎం జగన్ ప్రభుత్వంలో అనేక ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు అర్హులైన వయో వృద్ధులకు, వితంతువులు, వికలాంగులకు నూతన పింఛన్లు మంజూరు చేయడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలి

**దువ్వూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త:**



దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ చంద్రహాసరెడ్డి, జిల్లా విజిలెన్స్ సీఐ దస్తగిరిలు అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఉప వైద్యాధికారి డా.చంద్రహాసరెడ్డి, అలాగే జిల్లా విజిలెన్స్ అధికారుల బృందం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీ నందు రికార్డులు సక్రమంగా నమోదు చేయాలని, మందుల పంపిణీ, కాన్పుల వివరాలు నమోదు చేయాలన్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు జరిగే తల్లి పాల వారోత్సవాలు జయప్రదం చేయాలని, ఈనెల 15న జరిగే ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం విజయవంతం చేయాలన్నారు. విజిలెన్స్ సీఐ దస్తగిరి మాట్లాడుతూ ఆసుపత్రి నందు అన్ని రికార్డులు సక్రమంగా ఉన్నాయని, ఇంకా మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా.సమీరా, సీహెచ్‌వో విజయకుమారి, వైద్య సిబ్బంది శివరామయ్య, మునిస్వామి, మేరీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత బియ్యం అందరికీ పంపిణీ చేయాలి

**దువ్వూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త:**



కేంద్ర ప్రభుత్వం అందజేసే ఉచిత బియ్యాన్ని అన్ని రేషన్‌కార్డు దారులకు పంపిణీ చేయాలని కోరుతూ మండల తెదేపా కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దారు రమాకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపా అధ్యక్షుడు నారా చంద్రబాబు పిలుపు మేరకు పేదలందరికీ ఉచిత బియ్యం అందజేయాలని ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కార్డులకు ఇస్తూందన్నారు. 30శాతం మందికి బియ్యం రాలేదని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రం ఇచ్చే బియ్యాన్ని వంద శాతం ఇవ్వాలన్నారు. అలాగే నిత్యావసర ధరలు కూడా తగ్గించాలని కోరారు. రేషన్ కార్డు దారులకు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసే మొబైల్ వాహనాలు సక్రమంగా రావడం లేదని ప్రతి ఒక్కరి ఇంటి వద్దకు వచ్చేలా చూడాలన్నారు. ఉచిత బియ్యం అందరికీ ఇచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు రాంబాబు, శ్రీను, మోహన్‌రెడ్డి, నాగరాజు, తాహిర్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి

**పులివెందుల, ఆగస్టు 1, ప్రభాతవార్త :**

సీఎం జగన్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని ఎమ్మెల్సీ బీటెక్ రవి అన్నారు. సోమవారం తొండూరు మండలంలో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లలో విద్యుత్తు, కరెంటు, బస్‌ఛార్జిలు అనేక సార్లు పెంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్నామని చెప్పుకుంటూ ప్రజలను దోచుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంట్ అధ్యక్షుడు మల్లేల లింగారెడ్డి, తొండూరు మండల ఇన్‌ఛార్జి శివమోహన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి విష్ణు కంచిరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగిరెడ్డి, రామసూరారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రవికుమార్‌రెడ్డి, మారుతి దేశాయ్‌రెడ్డి, చంద్రమౌళిరెడ్డి, హరిచంద్రారెడ్డి, దస్తగిరిరెడ్డి, రవీంద్రారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## డ్రైనేజీ కాలువ ఆక్రమణపై ఆర్డీవోకు వినతి

**విచారణ చేపట్టి న్యాయం చేస్తాం – ఆర్డీవో ఆకుల వెంకట రమణ**



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న సురేంద్ర నగర్ వాసులు

**బద్వేలు అర్బన్, ఆగష్టు 01 ప్రభాతవార్త :**

పట్టణంలోని సురేంద్ర నగర్‌లో డ్రైనేజీ కాలువ స్థలం, సందు స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు సోమవారం స్పందన కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి ఆకుల వెంకట రమణకు డ్రైనేజీ సమస్యను విన్నవించుకున్నారు. గత కొద్ది రోజులుగా ఒక వ్యక్తి స్థలం ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని అక్కడి డ్రైనేజీ విషయాన్ని సంబంధించిన మున్సిపల్ శాఖ అధికారులకు వినతిపత్రాల ద్వారా స్థానిక ప్రజలు తెలియజేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదని వార్డు ప్రజలు కత్తెరపల్లె జనార్ధన్ రెడ్డి, వద్దిబోయిన యానాది రెడ్డి, బుడిగిరెడ్డి సుబ్బారెడ్డి, కత్తెరపల్లె రామసుబ్బారెడ్డి, రమణారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, బిజివేముల రామసుబ్బారెడ్డి, నూమర్సు వెంకటేశ్వరరావు వినతిపత్రాలు అందజేశారు. స్పందించిన ఆర్డీవో ఆకుల వెంకట రమణ మాట్లాడుతూ సురేంద్ర నగర్‌లో ఆక్రమణకు గురైన డ్రైనేజీ కాలువ పనులపై తక్షణమే విచారణ చేపట్టి తగిన న్యాయం చేస్తామని తెలియజేశారు. అనంతరం స్థానిక వార్డు ప్రజలు మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు రోడ్లు, డ్రైనేజీలు అవసరం అని తెలిసి కూడా ఆక్రమణలు చేపడితే రాబోవు రోజుల్లో రోడ్లన్నీ కుదించుకుపోవడమే గాక డ్రైనేజీ కాలువలు లేకపోతే ఎంత ఇబ్బందులు ఎదురవుతాయో చెప్పనవసరం లేదని, ప్రస్తుతం మున్సిపాలిటీలో ఇప్పటికే ఆక్రమణలు జరిగి రోడ్లు, డ్రైనేజీ కాలువలు బూడిపోయిన పరిస్థితి కనపడుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు విచారణ చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యధావిధిగా డ్రైనేజీ కాలువ గతంలో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు ప్రజలు విన్నవించారు.

## ఇంజనీరింగ్ ఫలితాలలో విజయభేరి

**రాయచోటి, ఆగస్టు 1 ప్రభాతవార్త**



రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ సంవత్సరం ప్రథమ సెమిస్టర్ ఫలితాల యందు ఇంజనీరింగ్ విద్యార్థులు విజయబేరి మోగించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక శాతం మార్కులు సాధించారు. ఈ సందర్భంగా శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎప్పటిలాగే ప్రథమ సంవత్సర ఫలితాలు యందు కూడా కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి యూనివర్సిటీ పరిధిలో కళాశాలను అగ్రస్థానంలో నిలబెట్టారని తెలియజేస్తూ విద్యార్థినీ విద్యార్థులను, కళాశాల అధ్యాపకులను అభినందించారు. ప్రథమ సంవత్సర ప్రథమ సెమిస్టర్ ఫలితాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో షరీఫ్ భాష **87.8**, శాతం తో మొదటి ర్యాంకు నీరజ **87.4** శాతంతో రెండవ ర్యాంకు సాయి కుమారి **86.6** శాతంతో మూడవ ర్యాంకు మరియు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం నుంచి షేక్ రెడ్డి అబ్దుల్లా **81.4** శాతంతో మొదటి ర్యాంకు పి.అనిత **79.4** మరియు శాతంతో రెండవ ర్యాంకు పి.యశ్వంత్ **78.8** శాతంతో మూడవ ర్యాంకు సాధించారని తెలియజేశారు. ఫలితాల యందు ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.బాలాజీ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.నాగేంద్ర కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బాగాధిపతి శుభహాన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి చంద్రశేఖర్ వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

## పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం

**పులివెందుల, ఆగస్టు 1, ప్రభాతవార్త :**



రాష్ట్రంలో పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వేముల ఎంపీపీ చల్లా గంగాదేవి, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనరు నాగేళ్ల సాంబశివారెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టరు మరకా శివకృష్ణారెడ్డిలు అన్నారు. సోమవారం వేముల గ్రామ సచివాలయంలో లబ్ధిదారులకు నూతన పింఛన్లను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద కొత్తగా 155 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నాగప్ప, వైస్ ప్రెసిడెంట్ జెర్మియా, పంచాయతీ కార్యదర్శి సులోచన, వెల్ఫేర్ అసిస్టెంట్ గౌతమి, ఏఎన్ఎం అశ్విని, పాల్గొన్నారు.

## పట్టా భూముల్లో కొలతలకు అనుమతులు తీసుకోవాలి: తహసీల్దారు కుమార్

**పుల్లంపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త**



మండలంలోని పట్టా భూముల్లో ఉన్నతాధికారుల అనుమతి లేనిదే కొలతలకు వెళ్లవద్దని గ్రామ సచివాలయ సర్వేయర్లను మండల తహశిల్దారు నరసింహకుమార్ ఆదేశించారు. ఇప్పటికే రెండు మూడు చోట్ల ఉన్నతాధికారుల అనుమతి లేకుండా కొలతలు కొలవడం వల్ల తగాదాలు ఏర్పడ్డాయని ఆయన వివరించారు. అనుమతులు లేకుండా కొలవడం వల్ల గ్రామాల్లో రైతుల మధ్య మనస్పర్థలు వస్తున్నాయన్నారు. అలాగే భూమి కొలతల కోసం అరి ఇచ్చి చలనాలు కట్టినవారి పేర్లను రిజిస్టర్‌లో వరుస సంఖ్యలో నమోదు చేయాలని, అలా రిజిస్టర్ ప్రకారం ముందున్న వారిపేర్లవారిగా కొలతలకు వెళ్లకుండా ఎలా అంటే అలా కొలతలకు వెళ్లవద్దని కూడ ఆదేశించారు. ఇప్పటికైనా అలా జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించి సీనియారిటి ప్రకారం కొలతలు కొలిచి ఎలాంటి ఇబ్బందిలేకుండా చూసుకోవాలని ఆయన ఆ సర్వేయర్‌లను కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓలు, సర్వేయర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో 'ఆహార భద్రత'కు తిలోదకాలు

**వేంపల్లె, ఆగస్టు 1, ప్రభాతవార్త :**



రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ఆహార భద్రత అనే రాజ్యాంగ హక్కుకు తిలోదకాలు ఇస్తున్నారని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులను కుదించి ఆహార భద్రత చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారని టీడీపీ మండల కన్వీనరు రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు మహమ్మద్ షబ్బీర్‌లు అన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదేశ్వాల మేరకు సోమవారం రేషన్ పంపిణీపై తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి టీడీపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ కొరవడిందన్నారు. మండల వ్యాప్తంగా వందలాది రేషన్‌కార్డులు రద్దయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవికుమార్, వేంపల్లె మండల బీసీ అధ్యక్షుడు గోగుల మల్లికార్జున, ఇదయతుల్లా, బీసీసెల్ ప్రధాన కార్యదర్శి దక్కా రమేష్, వేంపల్లె పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, గండి దేవస్థాన మాజీ ఛైర్మన్ వెంకటస్వామి, మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, ఈశ్వరయ్య, ఇడుపులపాయ శివ, యుగంధర్, పాపిరెడ్డి, రామగంగిరెడ్డి, పిపి చెంద్రాయుడు, తదితరులు ఉన్నారు.

## అర్హుల జాబితాలో లేనివారికి పింఛన్లు

**రాజంపేట అర్బన్, ఆగస్టు 1 ప్రభాతవార్త**



గతంలో అర్హుల జాబితాలో లేనివారికి పింఛన్లు మంజూరు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జడ్‌పి ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మందపల్లెలో 23 మందికి మంజూరైన పెన్షన్లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో మందపల్లె సర్పంచ్ శ్రీహరి, వైకాపా నేతలు బి.రామ్మోహన్‌నాయుడు, హరిబాబు, సచివాలయ సిబ్బంది, పింఛనుదారులు పాల్గొన్నారు.

## ఉచిత రేషన్ బియ్యం పంపిణీ చేయాలి

**ఒంటిమిట్ట, ఆగస్టు 1 ప్రభాతవార్త**

రేషన్ పంఫిణీలో అవకతవకలు జరుగుతున్నయని సోమవారంస్థాని క తహసిల్దార్ శ్రీనివాసులరెడ్డికి మండల టిడిపి నాయకులు వినతి పత్రం ఆందజేశారు. రేషన్ బియ్య ం పక్కదారికి తరలిపోతున్న ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రతి ఒక్క పేద కుటుంబానికి పంఫిణి చేయాలని విన్నవించారు. రేషన్ షాప్‌లో ఇచ్చే సరుకులు కూడా రేట్లు పెంచి ప్రజలను ఆలాగే ప్రతి విషయంలో బాదుతున్న ఈ ప్రభుత్వానికి దగ్గర్లోనే ప్రజలు తగిన గుణపాఠం చేప్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రదానకార్యదర్శి బొబ్బిలిరాయుడు, ఉపాధ్యక్షుడు మౌలాలి, మండల యువనాయకులు గజ్జల శ్రీనివాసరెడ్డి, నాయకులు వెంకటసుబ్బారెడ్డి, రమణ, ఆలూరు వెంకటసుబ్బయ్య, యానాదయ్య,మాజీ సర్పంచ్ బాషా, ఉన్నం కిరణ్‌స్వామి, సాదు శ్రీనివాసులు,మెదుగుల హరి, వెంకటసుబ్బారెడ్డి, చౌదయ్య, కాకిపెంచలయ్య, చెరువుపల్లి పెంచలయ్య, యెసు, షరీఫ్, రవిశంకర్, గఫార్, కదిరి వెంకటసుబ్బయ్య తదితరులుపాల్గోన్నారు.

## అన్నిదానాల్లో అన్నదానం మిన్న

**సుగవాసి ప్రసాద్‌బాబు**

**రాయచోటి, ఆగస్టు 1 ప్రభాతవార్త**



అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని తెలుగుదేశం నాయకుడు, టిటిడి మాజీ పాలకవర్గ సభ్యులు ప్రసాద్ బాబు అన్నారు. సోమవారం రాయచోటీ పట్టణంలోని కొత్తపేటలో వెలసిన శివరామలయంలో శ్రావణ మాసం సందర్భముగా ఏనుగుల విశ్వనాథ్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భముగా ప్రసాద్ బాబు మాట్లాడుతు పవిత్రమైన శ్రావణ మాసంలో ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనియమన్నారు. ప్రతి ఒక్కరు భక్తి భావం అలవర్చుకొని సమజానికి ఉపయోగపడే మంచి పనులు చేయాలని సూచించారు. ప్రముఖ వైద్యుడు బయారెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని,మానవత విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. అనంతరం వీరిద్దరిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో లాయర్ సతీష్ రెడ్డి, మాజీ సర్పంచ్ శశిధర్ రెడ్డి, మేస్త్రి రమణ,ఎలక్ట్రీషియన్ శ్రీను, పెయింటర్ రమణ, సుందరయ్య, సుగవాసి శ్రీనివాసులు, మన్నేరు రామాంజనేయులు, పాపులర్ షూ మార్ట్ హరి, రఘురామరాజు, జయరామరాజు, నాగరాజు, చిన్నరెడ్డి, సిద్దారెడ్డి, స్టూడియో ప్రసాద్, త్యాగరాజు, హెల్మెట్ నిసార్, కేసి ప్రసాద్, సురేంద్ర, రవికుమార్, టిఎన్ఎస్ఎఫ్ శివ, గోవిందు సుధాకర్, రవి, రమణ, మధు, లక్ష్మయ్య, అనిల్, అఫ్రోజ్, నాగేంద్ర, నాగార్జున, రమణ భక్తులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఎంపీడీవో అంకిరెడ్డి రామారెడ్డి మృతి తీరని లోటు

**మానవత అధ్యక్షులు నాగిరెడ్డి శంకర్ రెడ్డి**

**బద్వేలు అర్బన్, ఆగష్టు 01 ప్రభాతవార్త :**

మంచి తనానికి మారుపేరుగా నిలిచి బద్వేలు ప్రాంత ప్రజల్లో ఎంతో ప్రేమ, ఆప్యాయత సంపాదించుకొని కష్టాల్లో ఉన్న వారికి చేయూతనిచ్చే లక్ష్యంలో కృషి చేసిన రిటైర్డ్ ఎంపీడీవో, ఏపీ పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు అంకిరెడ్డి రామారెడ్డి (82) మృతి తీరని లోటు అని మానవత అధ్యక్షులు నాగిరెడ్డి శంకర్ రెడ్డి, శ్రీవారి ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్ బాదిరెడ్డి వెంకటరామి రెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ రాజగోపాల్ రెడ్డి, పెన్షనర్స్ సంఘం అసోసియేట్ అధ్యక్షులు కత్తి బ్రహ్మయ్య, గంజికుంట పుల్లయ్య, కొప్పు శ్రీరాములు, ముళ్ళపాటి పిచ్చయ్య, రాయలసీమ స్కూల్ అధినేత మణ్యం చిన్నపరెడ్డి, అంకయ్య, 21వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి ఓబుల్ రెడ్డితో పాటు పలువురు పేర్కొన్నారు. మృతిచెందిన అంకిరెడ్డి రామారెడ్డికి భార్యతో పాటు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కలరు. అంకిరెడ్డి రామారెడ్డి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన అనంతరం ఏపీ పెన్షనర్స్ సంఘం అధ్యక్షులుగా ఉంటూ నియోజకవర్గ స్థాయిలో పెన్షనర్లు అందరితో కలిసిమెలిసి ఉంటూ కార్యాలయంలో అన్ని వ్యాధులకు సంబంధించిన వైద్యులతో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ పెన్షనర్స్ సంఘ సభ్యులకు ఎటువంటి అవసరం వచ్చినా నేనున్నానంటూ ముందుకొచ్చి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరాయంగా కృషి చేసిన గొప్ప వ్యక్తి అంకిరెడ్డి రామారెడ్డి అన్నారు. ఆయన మృతికి వివిధ శాఖల అధికారులు, నాయకులు, స్థానిక ప్రజలందరూ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.